క్లుప్తంగా

సీసీ రోడ్డు నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వేసిన డ్రైనేజీ, సీసీ రోడ్డుల నాణ్యతను మంగళవారం పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి పరిశీలించారు. సర్పంచ్ వారం ఈరన్న సమక్షంలో నాణ్యతను, రోడ్డు విస్తరణను తనిఖీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తుంబిగనూరు కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేశారు. ఎంపీ నిధులు రూ.20లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5లక్షలతో ఐదు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరు ఏర్పాటుకు పూజ ఉపాధ్యాయులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినిల సౌకర్యార్థం ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగా తాగునీటి బోరును వేయించారు. ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య సమక్షంలో విద్యాకమిటీ చైర్మెన్ ముకుంద కృష్ణమూర్తి, హెచ్‌ఎం నీలకంఠ తదితరులు భూమి పూజ చేసి బోరు వేయించారు. 500 అడుగుల్లో ఒకటిన్నర ఇంచులు నీరుపడింది. ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేసి ఆర్డీటీకి కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల పరిరక్షణకు పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

ఆదోని టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు పోరాడదామని ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు వెంగళ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎన్జీవోస్ హోమ్‌లో నిర్వహించిన ఆదోని తాలూకా ఉద్యోగ, ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌రెడ్డి, యాసిన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఈసీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, అరియర్స్, సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు రాజకీయ నాయకుల భూదందాలు, ఆక్రమణలు, ఒత్తిళ్లకు తలొగ్గితే తీవ్ర ఇబ్బందులు తప్పవనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో ఏపీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జవహర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సప్తగిరిరెడ్డి, పట్టణ నాయకులు మల్లికార్జునరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

అన్ని వీధుల్లో విద్యుత్ లైట్లు వేయిస్తాం

కౌతాళం: కౌతాళంలోని అన్ని వీధుల్లో విద్యుత్ లైట్లు వేయిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాలదినకర్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. వీధి లైట్లు పోయిన చోట గుర్తించి విద్యుత్ బల్బుల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజనగర్ క్యాంపులో వీదిలైట్లను వేసినట్లు తెలిపారు.

దుర్భాషలాడిన రిటైర్డ్ పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు విన్నవిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆదోని రూరల్ : విధి నిర్వహణలో ఉన్న తమను రిటైర్డ్ ఏఎస్‌ఐ నాగరాజు దుర్భాషలాడారని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని మండిగిరి గ్రామ పంచాయతీ సిబ్బంది వెంకటేశులు, వాసు, గోపాల్, పరమేష్, నరసప్ప మంగళవారం సబ్ కలెక్టర్ అభిషేకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈనెల 20న ఉదయం 9:30 గంటల సమయంలో కార్మికులు తిరుమల నగర్‌లోని సనా ఫంక్షన్‌హాల్ వెనకవైపు పనిచేస్తున్న సమయంలో రిటైర్డ్ ఏఎస్‌ఐ నాగరాజు పరమేష్‌ను దుర్భాషలాడారని కార్మికులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కులం పేరుతో దూషించాడని, నానా దుర్భాషలాడాడని వాపోయారు. విచారించి రిటైర్డ్ ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

ఇంటింటికీ సుజలం

- పల్లెపల్లెకు జల జీవన్ మిషన్ ఫలాలు
- రూ.40.61 కోట్లతో ప్రారంభమైన పనులు
- తీరనున్న సొంతింటి కుళాయి కల



గౌదగల్లులో జల జీవన్ మిషన్ కుళాయిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి (ఫైల్)

మంత్రాలయం: గొంతులు తడుపుకోవాలంటే.. బోరు బావుల వద్దకు పరుగులు... కుళాయిలతో పడిగాపులు... వాగు వంకల్లో చెలమల కోసం వెంపర్లాటలు. ఇవి నిన్నటి వరకు పల్లెవాసులు పడిన క'న్నీటి' పాట్లు. ఇక అన్నింటికీ ఉపశమనం లభించనుంది. ప్రభుత్వం చేపట్టిన 'జల జీవన్ మిషన్' (జేజేఎం)తో పల్లె ముంగిళ్లలోకే సుజలం చేరువైంది. చెరువైన గుండెలను చల్లబరిచేలా మిషన్ పనులు సాగుతున్నాయి. నియోజకవర్గంలో ప్రతి పల్లె గడపకు మంచినీరు రానుండటంతో పల్లెవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 112 పల్లెలు ఉండగా 03 మేజర్ పంచాయతీలు, 91 గ్రామ పంచాయతీలు. దాదాపు 2,53 లక్షల మేరా జనాభా. నియోజకవర్గంలో దాదాపు 70 శాతం పల్లెలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నవే. గతంలో ఉన్న సాతనూరు, మంత్రాలయం, హాల్వి, పెసలబండ నెదర్లాండ్ పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తూ వచ్చారు. రొడూరు, హాల్వి, సూగూరు ఎస్.ఎస్ ట్యాంకుల ద్వారా కొన్ని గ్రామాలకు నీరందిస్తూ వచ్చారు. పథకాల నిర్వహణ దారితప్పడంతో తాగునీటి కష్టాలకు పరిష్కారం దొరకలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల జీవన్ మిషన్ ప్రవేశపెట్టి పరిపూర్ణంగా పల్లెల దాహార్తికి పరిష్కారం చూపాలని తలచింది. విడతల వారీగా ప్రతి పల్లెలోనూ ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుతో తాగునీటి పథకాల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జఠిలంగా తాగునీటి ఇక్కట్లు ఉన్న గ్రామాల్లో మిషన్ పనులు ప్రారంభించింది. పథకం కింద నూతన బోర్లు, పైపులైన్లు, సంపులు, ఓహెచ్ఆర్ ట్యాంకులు, జీఎస్ఎల్ఆర్ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిల నిర్మాణం పనులు చేపట్టారు.

రూ.40.61 కోట్లతో పనులు

మంత్రాలయం నియోజకవర్గంలో మొదటి విడతగా ఇప్పటికే రూ.40.61 కోట్లతో పనులు ప్రారంభించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. 24 పల్లెల్లో పనులు చేపట్టగా 13 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మరో 11 గ్రామాల్లో పనులకు చివరి అంకానికి చేరాయి. మంత్రాలయం మండలంలో సుంకేశ్వరి, చిలకలడోణ, చెట్నిహళ్లి, రచ్చుమర్రి, సూగూరు, బూదూరు, వగరూరు,మంత్రాలయం, మాధవరం గ్రామాలు, కోసిగి మండలంలో గౌడగల్లు, దొడ్డి బెళగల్, పల్లెపాడు, జుమ్మాలదిన్నె, వందగల్లు, చిన్నభూంపల్లి, నేలకోసిగి, కోసిగి, తుంబిగనూరు గ్రామాలు, కౌతాళం మండలంలో అగసలదిన్నె, మదిరె, చూడిక్యాంపు, కరణి, బంటకుంట గ్రామాలు, పెద్దకడబూరు మండలం కొత్త గొల్లల దొడ్డి, దొడ్డిమేకల, గంగులపాడు, తారాపురం, కౌలేకల్లు, ముచ్చగిరి, కంబలదిన్నె, బసల దొడ్డి, చిన్నకడబూరు, రాగిమాన్‌దొడ్డి, గవిగట్టు, నాగలాపురం, కల్లుకుంట గ్రామాల్లో పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో అవసరం దృష్ట్యా 10 ఓహెచ్ఆర్ ట్యాంకులను సైతం నిర్మించారు. ఇంకా కోసిగిలో 21, పెద్దకడబూరులో 07, కౌతాళంలో 35, మంత్రాలయంలో 10 గ్రామాలకు ప్రతిపాదనలు పంపారు. సదరు ప్రతిపాదనలకు సంబంధించి మరో రూ.20 కోట్ల మేర నిధులు మంజూరు దశలో ఉన్నాయి.

జల జీవన్ మిషన్ కింద నియోజకవర్గంలో చేపట్టిన పనులు వివరాలు

మండలం	జేజేఎం నిధులు	ఓహెచ్ఆర్	కుళాయిలు ట్యాంకులు	పనులు పూర్తయిన గ్రామాలు
కౌతాళం	26.92 కోట్లు	04	6,020	05
కోసిగి	04.59 కోట్లు	06	3,954	04
మంత్రాలయం	03.60 కోట్లు	04	4,203	02
పెద్దకడబూరు	05.50 కోట్లు	10	4,323	03



తుంబిగనూరులో జరుగుతున్న పైపులైను పనులు

18,500 ఇంటింటి కుళాయిల ఏర్పాటు

ఇప్పటి వరకు పనులు చేపట్టిన పల్లెల్లో 18,500 ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. 60 శాతం పనులు పూర్తికాగా 13000 కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. మైనర్ పనులు ముగియగానే త్వరలో ఇంటి ముంగిటకు మంచినీళ్లు రానున్నాయి. తక్కిన పల్లెల్లోనూ ఏడాదిన్నరలో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం పనులు వేగవంతంగా సాగిస్తోంది. కన్నీటి ఇక్కట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కావడంతో ప్రత్యేక దృష్టి పెట్టారు.

మంచినీటి కష్టాలు తీరాయి



మా గ్రామంలో మొత్తం 155 ఇళ్లు ఉన్నాయి. జల జీవన్ మిషన్ కింద 155 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. గ్రామస్తుల తాగునీటి కష్టాలు పూర్తిగా తీరిపోయాయి. గతంలో పొలం గట్ల వెంట నీటి కోసం వెళ్లేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏళ్లతరబడి నెలకొన్న నీటి కష్టాలు తీర్చిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు.

– మహదేవ, గౌదగల్లు

రూ.19 లక్షలతో పనులు



మా గ్రామంలో జల జీవన్‌మిషన్ కింద రూ.19 లక్షలతో తాగునీటి పనులు చేపట్టాం. గ్రామంలో కొత్తగా 93 కుళాయిల కనెక్షన్‌లు ఇచ్చాం. ప్రతి ఇంటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నాం. గ్రామస్తులంతా సంతోషంగా ఉన్నారు. నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– వారం ఈరన్న, తుంబగనూరు సర్పంచ్

భక్తిశ్రద్ధలతో బీరప్పస్వామి దేవర

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని చెట్నిహళ్లి గ్రామంలో వెలసిన బీరప్పస్వామి దేవర ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. తెల్లవారుజాము నుంచే పెద్దకడబూరు మండలం కల్లుకుంట యాదగిరప్ప, ఎమ్మిగనూరు మండలం మసీదుపురం వణికేరప్ప, చెట్నిహళ్లి గ్రామంలో వెలసిన అలింగప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీరప్ప, కమలమ్మల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించి న పోంజాట ఎంతగానో ఆకట్టుకుంది.దేవర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

కౌతాళం: విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఒత్తిళ్లకు గురికాకుండా ఇష్టంతో చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కౌతాళం జెడ్పీ పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ ఉపాధ్యాయులు, సీఆర్పీ రామాంజినేయులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆదోని రూరల్ : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేకుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సాంబగల్ గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి ప్రజలకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయలన్నారు. మీ ద్వారా పరిష్కారం గాని సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతకుముందు అగ్రికల్చర్ భూమిని నాన్ అగ్రికల్చర్‌గా మార్చాలని దరఖాస్తు చేసుకున్న నెట్టేకల్ గ్రామానికి చెందిన గిరిజప్ప పొలాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సాంబగల్‌లోని సచివాలయ రికార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: పట్టణంలోని మారెమ్మవ్వ గుడి వద్ద మంగళవారం సెబ్ అధికారులు దాడులు జరిపి బోయ నాగరాజు, జయలక్ష్మి బైక్‌పై 336 ఆక్ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఆదోని రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆదోని పట్టణానికి చెందిన బోయ రాముడు బ్యాగులో192 ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఆదోని బీఎంపీపీ సీఐ దశరథ్, ఆదోని సెబ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఆలూరు రూరల్: ఉగాది నాటికి జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అన్ని మండలాల హౌసింగ్ ఏఈలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆలూరు మండలంలో 247 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా టార్గెట్ ఉండగా.. ఇప్పటివరకు 107 గృహాలు పూర్తయ్యాయన్నారు. ఆస్పరి మండలంలో 290కు గాను 176, చిప్పగిరిలో 225కు గాను 120, దేవనకొండ మండలంలో 733కు 398, హాలహర్విలో 178కు 88 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. అలాగే హొళగుంద మండలంలో 244 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 139 గృహాలు పూర్తిస్థాయిలో నిర్మించుకున్నట్లు చెప్పారు.

చిన్నోడికి పెద్ద కష్టం

- అప్లాస్టిక్ అనీమియాతో మృత్యువుతో పోరాటం
- బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలన్న వైద్యులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

పత్తికొండ రూరల్: రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో కొడుకు పుట్టాడన్న ఆనందం ఎన్నాళ్లో నిలువలేదు. రెండో ప్రసవం సమయంలోనే తల్లీ, బిడ్డ మృతి చెందడంతో మొదటి కుమారుడు తల్లి ప్రేమకు దూరమయ్యాడు. ఆ బాలుడిని ప్రాణాంతకమైన అప్లాస్టిక్ అనీమియా కబలించడంతో రోజురోజుకు నిస్సత్తువ ఆవహించి నీరసించిపోతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న బిడ్డను బతికించుకునేందుకు పేదరికం తండ్రికి అడ్డంకిగా మారింది. దయగల మారాజులెవరైనా ఆపన్న హస్తంతో తన బిడ్డకు ప్రాణం పోస్తారేమోనని ఎదురుచూస్తున్నారు.

పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మన్న, వెంకటలక్ష్మి దంపతులకు జశ్వంత్‌కుమార్ సంతానం. కూలి పని చేసుకుని జీవించే ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చేసింది. రెండో కాన్పు సమయంలో తల్లీ, బిడ్డ మృతి చెందారు. ఏడాది వయసులోనే తల్లి ప్రేమకు దూరమైన జశ్వంత్‌ను తండ్రి లక్ష్మన్న అన్నీ తానై చూసుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట నుంచి రోజురోజుకు నీరసించిపోతుండటంతో విశ్వభారతి, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చూపించారు. రక్తహీనతను గుర్తించిన వైద్యులు నాలుగు దఫాలుగా 12 బాటిళ్ల 'ఓ' పాజిటివ్ గ్రూపు రక్తం ఎక్కించారు. అయినా రక్తవృద్ధి లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా అప్లాస్టిక్ అనీమియా, ఎముక మూలుగులోనే సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. ఇందుకు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తే చిన్నారి కోలుకుంటాడని, రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. బతుకు దెరువే కష్టంగా ఉన్న వారికి అంత ఖరీదైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక రోజురోజుకూ సచ్చుబడిపోతూ క్షీణిస్తున్న కొడుకును చూసి కుమిలిపోతున్నాడు. చిన్నారి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పడిపోయి ప్లేట్‌లెట్స్ సంఖ్య క్రమేపీ తగ్గుతూ బాలుడిని నిస్సత్తువ ఆవహించింది. మృత్యువుతో పోరాడుతున్న తన బిడ్డను బతికించేందుకు దయగల మారాజులెవరైనా చేయూతనందిస్తారేమోనని ఆ తండ్రి దీనస్థితితో ఎదురుచూస్తున్నాడు.



అచేతనంగా పడిఉన్న చిన్నారి జశ్వంత్‌కుమార్

దాతలు సాయమందించేందుకు వివరాలు
ఏపీజీబీ, పత్తికొండ బ్రాంచ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఏపీజీబీ 0003081,
అకౌంట్ నంబర్ : 19053620569,
సంప్రదించాల్సిన సెల్ నంబర్లు 73963 94008, 81062 08481

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ మాతృభాష పట్ల మమకారం, అభిమానం సహజంగా ఉన్నా అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించడానికి హిందీ, ఇంగ్లిష్ భాషలో నేర్పరితనం కచ్చితంగా ఉండాలన్నారు. ఇతర భాషల పట్ల మోజు ఉన్నప్పటికీ మాతృభాషను మరువరాదన్నారు. బెంగాల్ ప్రాంతంలో మాతృభాష కోసం నలుగురు ప్రాణ త్యాగం చేసిన సందర్భంగా ఫిబ్రవరి 21వ తేదీన మాతృభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామ్‌కిషన్, మధు, వెంకటేష్, ప్రకాష్‌రావు, ఎర్రిస్వామి, బాలస్వామి, నరసింహులు, ఉమాదేవి, సంతోషి, జొనాథన్ తదితరులు పాల్గొన్నారు.

– నెహ్రూమెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో....

పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అరసం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అలీంసిద్దిఖీ, అరసం అధ్యక్షుడు ప్రహ్లాద్ తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు మాతృభాష గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామయ్య, సుధాక ర్, వెంకటేష్, కోటన్న, లోక్యనాయక్, రమణ పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు వెంకటలక్ష్మీల ఆధ్వర్యంలో సోమవారం మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభాష ఎన్నటికి మరువరాదన్నారు. విద్యార్థులచే పద్య ఉచ్ఛరణ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమేష్, శ్యామలకుమారి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్



పద్య పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రేపు మార్కెట్ యార్డులు బంద్



ఆదోని మార్కెట్ యార్డు సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు

ఆదోని అర్బన్: తమను ఆదాయపు పన్ను పరిధిలోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ కమీషన్ ఏజెంట్లు ఈనెల 23న ఒక్కరోజు సమ్మె చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిపే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులు బంద్ కానున్నాయి. కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీ కార్యాలయాల్లో మంగళవారం కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

కోసిగి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా నాయకుడు లింగప్ప యాదవ్, ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం స్థానిక నారాయణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్తదానం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హొళగుందకు చెందిన బసవరాజుతో పాటు మరో ఇద్దరు 96 మద్యం టెట్రా ప్యాకెట్లను కర్ణాటక నుంచి తీసుకొస్తుండగా ఎల్లెల్సీ వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మంత్రాలయంలో అటార్నీ జనరల్

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు అటార్నీ జనరల్ వెంకటరమణ మంగళవారం రాత్రి మంత్రాలయం చేరుకున్నారు. ఈయనకు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ వినోద్‌కుమార్, శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఉదయం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తాం



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాపు, బలిజ సంఘం నాయకులు

ఆదోని టౌన్: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కాపు, తెలగ, బలిజ నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆదోని తాలూకా పరిధిలోని కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గాలు శ్మశాన వాటిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, భీమలింగప్ప ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సాయి మాట్లాడుతూ అధికారులతో చర్చించి హిందూ శ్మశానవాటిక వెనక కొండ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఖాళీ స్థలాన్ని కాపు, బలిజల శ్మశాన వాటికకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఏ వర్గానికైనా శ్మశాన వాటిక ఎంతో అవసరమని, సాధ్యమైనంత త్వరగా స్థలం కేటాయింపునకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

విత్తనశుద్ధితో అగ్గి తెగులు నివారణ

మంత్రాలయం: వరి పంట సాగులో విత్తన శుద్ధితోనే అగ్గి తెగులును నివారించవచ్చని వ్యవసాయ సంచాలకులు ఎస్ మహ్మద్ ఖాద్రి పేర్కొన్నారు. సోమవారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో వరి పైర్లలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వరి పంటకు సోకే తెగుళ్లు, చీడ పీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అగ్గి తెగులు సోకడంతో దిగుబడులపై ప్రభావం చూపుతుందని, విత్తు సమయంలో కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే మిత్రపురుగు సాలీడుతో వరిలో లాభాలను రైతులకు వివరించారు. దోమపోటును దాదాపు సాలీడు మిత్రపురుగు నియంత్రిస్తాయన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభసాటిగా సాగు సాధ్యపడుతుందని చెప్పారు. అనంతరం పొలంబడి నిర్వహణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి గణేష్, విస్తరణాధికారి నరసింహుడు, రేఖామాధురి, ఎంపీఈవో, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.



వరి పైరులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు